క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎండీ అన్ను ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

ఆదోని టౌన్ : రంజాన్ పండగ సందర్భంగా పేద ముస్లింలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని హవేలీ ఫంక్షన్ హాలులో నూర్, జిలానీ ఆధ్వర్యంలో 220 మంది నిరుపేదలకు కిట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. నాయకులు ఖాజీసాహెబ్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి జయంతి



కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేస్తున్న కళాకారులు

ఆదోని అర్బన్ : స్థానిక కేఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఆదివారం లలితకళా సంస్థ ఆధ్వర్యంలో రచయిత, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి నిర్వహించారు. కళాసేవ సంస్థ సభ్యులు నల్లారెడ్డి, నటరాజుస్వామి, హనుమాన్‌సింగ్, కుమార్‌గౌడ్ తదితరులు వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వీరేశలింగం సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను తొలగించేందుకు చేసిన కృషిని కొనియాడారు. సతీసహగమనం అరికట్టడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడం, బాల్య వివాహాలను అరికట్టడం, స్త్రీ విద్యను ప్రోత్సహించడం లాంటివి ఇందులో ఉన్నాయని వివరించారు.

గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అపార్ట్‌మెంట్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

ఆదోని అర్బన్: గ్యాస్ ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక కేంద్ర అధికారి యేసు రత్నం తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో మహిళలకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ నుంచి మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పివేయాలని ప్రదర్శన ద్వారా వివరించారు. గ్యాస్ లీక్ అయ్యిందని తెలిసినప్పుడు ఇంట్లో విద్యుత్ సరఫరా మొత్తం ఆఫ్ చేసుకోవాలని చెప్పారు.కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశపరీక్ష



వెల్దుర్తిలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

వెల్దుర్తి: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఆర్‌కే రోడ్డులో గల జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం పరీక్ష కేంద్రంగా జరిగిన ఈ పరీక్షకు జిల్లాలోని 431 మంది దరఖాస్తు చేసుకోగా 35 మంది గైర్హాజరైనట్లు సూపరింటెండెంట్ షబానా బేగం తెలిపారు. నిర్వాహకులు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను, హాల్ టికెట్, గుర్తింపు కార్డులతో మాత్రమే విద్యార్థులను పరీక్షకు అనుమతించారు. ఆరుగురు చిన్నారుల వద్ద హాల్‌టికెట్ లేకపోగా నలుగురు దరఖాస్తు సమయంలోని అక్నాలెడ్జ్ కార్డుతో హాజరయ్యారు. మరో ఇద్దరు ఆన్‌లైన్ సమస్య కారణంగా అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు సైతం పొందలేక పరీక్ష రాయలేకపోయారు. పరీక్షా కేంద్రంలో అధికారులు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులు తమ బాధ్యతలు నిర్వహించారు.

పల్లెల్లో నాణ్యమైన వైద్యం

- శరవేగంగా వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు
- మండలంలో 23 కేంద్రాలకు నిధులు మంజూరు
- ఇప్పటికే రెండు ప్రారంభం
- మరో 12 రూఫ్‌లెవెల్‌లో, 9 బేస్‌మట్టం స్థాయిలో పనులు



గణేకల్‌లో ప్రారంభించిబడిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం

ఆదోని రూరల్ :గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం)ల నిర్మాణాలు చేపట్టింది. ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ.17.50 లక్షలు కేటాయించింది. మండలంలో మొత్తం 44 గ్రామాలు, 41 పంచాయతీలు ఉన్నాయి. 41 పంచాయతీల్లో 37 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 23 వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిల్లో గణేకల్, మాంత్రికి గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 12 రూఫ్‌లెవెల్‌లో నిర్మాణ పనులు సాగుతున్నాయి.

రూఫ్ లెవెల్‌లో ఉన్నవి..

బల్లేకల్, ఇస్వీ, ధణాపురం, కపటి, నారాయణపురం, సాంబగల్, జి.హొసళ్లి, జాలిమంచి, నాగలాపురం, నాగనాథనహళ్లి, పెసలబండ, చిన్నహరివాణం గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణాలు రూఫ్‌లెవెల్‌లో ఉన్నాయి.

బేస్‌మట్టం లెవెల్‌లో ఉన్నవి..

మండలంలోని కుప్పగల్, మండిగిరి, పెద్దహరివాణం, విరుపాపురం, బైచిగేరి, హాన్వాల్, చిన్నపెండేకల్, దిబ్బనకల్, బసరకోడు



మండిగిరిలో బేస్‌మట్టం స్థాయిలో..



మాంత్రికిలో సేవలందిస్తున్న వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం

వేగంగా నిర్మాణాలు



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తోంది. ఈ కేంద్రాల నిర్మాణ పనులు మండలంలో వేగంగా చేపడుతున్నాం. ఇప్పటికే గణేకల్, మాంత్రికి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావడంతో ఎమ్మెల్యేతో ప్రారంభింపజేయించాం. మిగిలిన భవనాల నిర్మాణాలు త్వరలోనే పూర్తవుతాయి.

– గీతావాణి, ఎంపీడీఓ

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: మండలంలోని కుంటనహాల్ గ్రామంలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొనే కార్యక్రమంలో అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమాన్ని మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

ఆదోని రూరల్ : పెండింగ్ డీఏను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదోని డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2022కు సంబంధించిన పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలన్నారు. సీనియర్ నాయకుడు బి.మహాదేవప్ప మాట్లాడుతూ పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌కు దీర్ఘకాలిక వ్యాధులు, చంటి బిడ్డలు ఉండే ఉపాధ్యాయినులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. జె.మహానంది, బి.మారయ్య, హెచ్.నాగరాజు, డి.హరిదాసు, పి.అంజనయ్య, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంతోషంగా ప్రజలు





వాల్మీకినగర్‌లో మహిళ అభిప్రాయాలను సేకరిస్తున్న దృశ్యం, దివ్యాంగురాలికి పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు ఉమామహేశ్వరి, గోవింద్, ఫయాజ్‌హ్మద్, తాయన్న పేర్కొన్నారు. నువ్వే మా నమ్మకం జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 16, 04, 36, 18, 19, 31 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బ్యాంకు మల్లి, రాజు, రాము, రామకృష్ణ, జిలేకాబీ, కన్వీనర్లు, గృహసారథులు,వలంటీర్లు పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని సర్పంచ్ పాల్‌దినకర్ అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాల్ని సేకరించారు. అలాగే చూడి, కుంబళనూరు క్యాంపులో, నదిచాగిలో, బాపురం, రౌడూరులో గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సమద్, ఈరన్న పాల్గొన్నారు.

కోసిగి: అర్హులందరికీ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక సచివాలయం–2 పరిధిలోని కడపాళెం వీధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటా పర్యటించారు. సచివాలయ కన్వీనర్ల బుళ్లి నరసింహులు, లోకారెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండలంలోని చిలకలడోణ, చెట్నేహళ్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంను సర్పంచ్ అంజిని, ఉపసర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ సభ్యులు రామాంజనేయులు నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని మేమే పూర్తి చేశాం

ఆదోని టౌన్ : టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిందని, అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి ఒక్క రూపాయి రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు అందజేసిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. అయితే చంద్రబాబునాయుడు టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీలు దిగి తామే టిడ్కో ఇళ్లను కట్టించామని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం చూస్తుంటే బాబు పరిస్థితి ఎంతటికి దిగి జారిపోయిందో తెలుస్తోందని విమర్శించారు. ఆదివారం కిలిచినపేటలో 90 మంది, వాల్మీకి నగర్‌లో 20 మందికి టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ వర్గాలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. గతంలో చంద్రబాబునాయుడు టిడ్కో ఇళ్ల పేరుతో పేదల నుంచి లక్షలాది రూపాయలు దండుకునే ప్రయత్నం చేశారని, అయినా ఒక్కరికీ కూడా పట్టా ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. సొంతింటి కల సాకారం చేసేందుకే జగనన్న టిడ్కో ఇళ్లను ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేయించి అందిస్తున్నాడన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, వార్డు ఇన్‌చార్జ్ దుర్గప్ప, నాయకులు బ్రహ్మ, రఘు, విజయ్, వెంకటేష్, చంద్ర, తిమ్మప్ప, సింహం నాగేంద్ర, తాయన్న, శ్రీదేవి, అన్నపూర్ణ, సుధాకర్, దస్తగిరి, బాషా, రఘు పాల్గొన్నారు.



టిడ్కో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే సాయి

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఆదోని టౌన్ : వాల్మీకినగర్‌లో నివాసముంటున్న లలితమ్మ, లక్ష్మీనారాయణ దంపతుల గుడిసె గ్యాస్ లీకై దగ్ధమైన విషయం తెలిసిందే. మంటల్లో ఇంట్లో ఉన్న తిండి గింజలు, బట్టలు, కొంత నగదు కాలిపోయి వీధినపడ్డారు. విషయాన్ని కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మధు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నిరుపేదలు కావడంతో ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో రూ.15 వేల నగదు, నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేసి ప్రభుత్వం నుంచి పరిహారం లభించేలా చూస్తామని భరోసానిచ్చారు.

హసీర్‌ఖానా నిర్మాణానికి విరాళం

మండలంలోని గోనబావి గ్రామంలో చేపట్టనున్న హసీర్‌ఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తన వంతుగా రూ.1,01,000 విరాళంగా అందజేశారు. ఆదివారం సర్పంచ్ ఆలీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ముస్లింలు ఎమ్మెల్యే నివాసంలో కలిసి వివరించడంతో ఆయన విరాళం అందజేశారు.

ఎస్ఎస్ ట్యాంక్ గండి పరిశీలన

ఆదోని రూరల్ : మండలంలోని కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకుకు గండి పడిన ప్రాంతాన్ని సీపీఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు మాట్లాడుతూ 2018లో గండి పడిందని, ఆ గండిని ఇప్పటి వరకు పూడ్చకుండా ఇటీవల పనులు ప్రారంభించారన్నారు. కాగా ట్యాంక్‌లో కేవలం పది అడుగులు మాత్రమే నీళ్లు నిల్వ ఉన్నాయని, ఈ నీరు 7 గ్రామాలకు ఒక నెలకు సరిపోదని చెప్పారు. పార్టీ మండల కార్యదర్శి కె.లింగన్న, నాయకులు కె.శేఖర్, రామాంజనేయులు, పాండురంగ, విరుపాక్షి పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సాదాపురం, భరత్‌నగర్ యూత్ సభ్యులు

ఆదోని టౌన్ : నియోజకవర్గంలోని సాదాపురం, భరత్‌నగర్‌కు చెందిన 30 కుటుంబాలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సేవలకు ఆకర్షితులై పార్టీలో చేరామని వారు తెలిపారు. సాదాపురం వాసి పవన్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. అంజి, రామాంజనేయులు, భరత్, రాజు, రవి, రాము పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు

నందవరం: ఆరు గాలం కష్టపడిన రైతన్నకు పంట పడింది. మంచి దిగుబడులు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతుకు అండగా నిలుస్తున్నాయి. రబీ సీజన్ పంటలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమై జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్‌లో వరికి రూ.2,200 నుంచి రూ.3 వేల వరకు ధర లభించడంతో రబీ సీజన్‌లో అధికంగా రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. దీంతో నది ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. యంత్రాల సవ్వడి.. కూలీల సందడితో నది తీర ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. మండలంలో రబీలో 2,250 ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. రైతులు ఎన్‌డీఎల్ ఎల్ఆర్, ఆర్ఎన్ఆర్, 555 వరి రకాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం మండలంలోని నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, నాగలదిన్నె, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల గ్రామాలలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీల భారంతో రైతులు యంత్రాల ద్వారా వరి కోతలను ప్రారంభించారు. కోతలు పూర్తయిన రైతులు ధాన్యాలను కల్లాల్లోనే ఆరబోసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వరికి మద్దతు ధర రూ.2,200 నుంచి రూ.2,500 వరకు లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చిన్నకొత్తిలి సమీపంలో వరి కోత కోస్తున్న యంత్రం

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



దేవరగట్టులో ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలో రుద్రాభిషేకంతో పాటు మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు మోకాళ్లతో మెట్లను ఎక్కుతూ వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయంలో పూజారులు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. సమస్త సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం చేశారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామానికి చెందిన కన్నయ్య, రఘు ఆదివారం కర్ణాటక మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా ఎస్ఐ నాగేంద్ర కుమార్ రెడ్డి సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ బదినేహాల్ గ్రామానికి చెందిన కన్నయ్య, రఘు 192 కర్ణాటక ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా, కన్నయ్య పట్టుబడగా, రఘు పారిపోయాడని చెప్పారు. మద్యం టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కన్నయ్యను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు వివరించారు.

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం తండా గ్రామంలోని కోళ్ల ఫారం వద్ద అదే గ్రామానికి చెందిన హనుమంతు నాయక్ 96 కర్ణాటకకు మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కిరణ్ తెలిపారు. మద్యం ప్యాకెట్లు అక్రమంగా తెస్తున్నాడనే సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా మద్యం లభ్యమైందన్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.



మద్యం,నిందితుడిని చూపుతున్న పోలీసులు

వృథా అరికట్టరూ!

కోసిగి: పులికనుమ రిజర్వాయర్ నుంచి సాగునీరు ఎల్లెల్సీ కాల్వ ద్వారా దిగువకు వృథాగా ప్రవహిస్తోంది. మార్చి ఆఖరి వరకు తుంగభద్ర నది నుంచి నీటిని రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేపట్టారు. నదిలో నీరు తగ్గుముఖం పట్టడంతో పంపింగ్ ప్రక్రియ నిలిపి వేశారు. అయితే రిజర్వాయర్ నుంచి స్లూయిస్ గేట్లు వద్ద పూర్తిస్థాయిలో మూసుకోకపోవడంతో దిగువకు ప్రవహిస్తోంది. పంపింగ్ నిలిచిపోయి పదిహేను రోజులు గడిచినా వృథాగా పారుతుండటంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. వృథా కొనసాగితే రిజర్వాయర్ పూర్తిగా ఖాళీ అయ్యే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వర్షాలు వచ్చే వరకు నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



రిజర్వాయర్ నుంచి వృథాగా ప్రవహిస్తున్న నీరు

సీసీ రోడ్లతో వీధులు కళకళ



నాడు.. మార్కండేయ స్వామి ఆలయ ముందు రోడ్డు దుస్థితి



నేడు.. సుందరంగా రూపుదిద్దుకున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలో అంతర్గత రోడ్లు లేక వివిధ కాలనీల వాసులు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయించారు. ప్రస్తుతం రోడ్ల పనులు పూర్తవడంతో స్థానికులకు ఇబ్బందులు తొలగాయి. స్థానిక సచివాలయం–1, 2, 3 పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కింద అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. వాటితో 1వ వార్డులో దొరల చావిడి నుంచి చౌడమ్మ వీధి వరకు, దొరల చావిడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు, కుమ్మర వీధి, పెద్ద మసీదు, నాడుగేని గేరి, కొత్తపేట, కొండుగానీ వీధి, మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణం ముందు తదితర కాలనీలో సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో స్థానికులకు ఇబ్బందులు తొలగాయి. కొత్తపేట కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు వసతి లేదు. కేవలం మెట్లు ఎక్కి దిగి వెళ్లాల్సిన దుస్థితి. ఎమ్మెల్యే చొరవతో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి రోడ్డు వేయించారు.



దొరల చావిడి సమీపంలో వేసిన సీసీ రోడ్డు

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న రామరాజు

ఆదోని అర్బన్ : అందరూ ఐకమత్యంగా మెలిగితే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక తిరుమలనగర్‌లోని శంకరమఠంలో డివిజన్ స్థాయి బ్రాహ్మణ ఐక్యవేదిక నిర్వహించారు. బ్రాహ్మణులందరూ ఐక్యమత్యంతో ఉంటే హక్కుల కోసం పోరాటాలు సాగించి సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు రవీంద్ర, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కమలనాథ శర్మ, నకతేశ్యామ్, రాష్ట్ర కార్యదర్శి దేశాయికృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.